

పకడ్బందీగా 'పది' పరీక్షలు

నేటి నుంచి ప్రారంభం : డిఇఒ

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు డిఇఒ కిష్టప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 144 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు 1484 మందిని స్కూల్ అసిస్టెంట్లను, కే జి బి వి నుంచి 317 మందిని, అలాగే ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెపాపరు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, మెడికల్ కిట్లను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో వెళ్ళవచ్చునన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ తోపాటు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అన్ని మండలాల కేంద్రాల్లోనూ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాధికారి లాజర్, ఏడి రామకృష్ణ, ఎంఇఒ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్పీ వి.రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రతి సెంటర్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ ఆంక్షలు అమలు పరిచి, సమీపంలోని జిరాక్సు, నెట్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు. ప్రజలెవరూ గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. విద్యార్థులు జాగ్రత్తగా ప్రయాణం చేసి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- రూ. కోట్లు కరుగుతున్నా ఫలితం సున్నా
- మూలన పడ్డ చెత్త సేకరణ వాహనాలు
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు



రహమత్ పురం మార్కెట్ ఎదురుగా ఉన్న చెత్తకుప్ప

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి వీధిలోనూ చెత్త పేరుకు పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొన్ని వీధుల్లో, కాలువల్లో ఉన్న వ్యర్థాలను నెలల తరబడి తొలగించడం లేదు. దీనికి తోడు పట్టణంలో నూతన కాలువల నిర్మాణం లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో మురుగు నీరంతా రహదారులపై చేరుతోంది. ప్రభుత్వం ప్రతి 2 వేల కుటుంబాలకు ఓ సచివాలయం చొప్పున వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినా పరిస్థితిలో ఎక్కడా మార్పు కనిపించడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

క్షేత్రస్థాయిలో పర్యటించని కార్యదర్శులు....

పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట నిర్మించిన కాలువల్లో నెలలు గడుస్తున్నా వ్యర్థాలను తొలగించడం లేదు. ఫలితంగా పట్టణంలో దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పట్టణంలో మొత్తం 38 వార్డుల్లో 43 సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, దాదాపు 365 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. సచివాలయాల వారీగా పారిశుధ్య నిర్వహణను కార్మికులకు కేటాయించారు. వారంతా ఆయా కార్యదర్శుల పర్యవేక్షణలో ఉంటూ పనులు చేయాల్సి ఉంది. కానీ కొంత మంది కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించ కుండా ఇళ్ల వద్ద నుంచే మార్గదర్శకాలు ఇస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కొరవడి ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోతోంది. రహమత్‌పురం రైల్వే స్టేషన్ ఎదురుగా, ఎల్ఐసి కార్యాలయం, హస్నాబాదు రోడ్డు, బెంగళూరు రోడ్డు, బాలాజీ టాకీస్ రోడ్డు, ధర్మపురం, ఆజాద్ నగర్, ఆర్‌టిసి కాలని, త్యాగరాజ్ నగర్ తదితర ప్రాంతాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆర్‌పిజిటి రోడ్డులో అసుపత్రి నిర్వాహకులు అసుపత్రి వ్యర్థాలను పడేస్తున్నారు. వాటిని రోజుల తరబడి తరలించకుండా అలాగే ఉంచుతుండడంతో పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సందులు, కాలనీల్లో చెత్త సేకరణ నుంచి మురుగు కాలువల శుభ్రంపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. నెలకు కార్యదర్శుల నుంచి కార్మికుల వరకు సుమారు అరకోటి వరకు వేతనాల రూపంలో ఖర్చు అవుతున్నప్పటికి పారిశుధ్యం మాత్రం అధ్వానంగా మారింది. పారిశుద్య నిర్వహణకు కోట్ల రూపాయలు కరుగుతున్నా పట్టణ వాసులకు దోమల కాట్లు మాత్రం తప్పడం లేదు.

ఫాగింగ్ ఊసే లేదు

ప్రజల ప్రాణాలకు పెద్దపీట వేయాల్సిన కొందరు అధికారులు, పాలకులు వారి సొంత లాభార్జన కోసం పాకులాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు బ్లీచింగ్, ఫాగింగ్ వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కాసులకు కక్కుర్తి పడే కొందరు బ్లీచింగ్ పౌడర్ స్థానంలో చాక్ పీసులు తయారు చేసే తెల్ల సున్నం పొడిని వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, పాలకుల పర్యటనలున్నా సమయంలోనే అది కూడా వినియోగిస్తున్నారే తప్ప తక్కిన సమయాల్లో దాని ఊసే లేదు. రసాయనాలతో కూడిన మిశ్రమాన్ని ఫాగింగ్ చేయించాల్సిన అధికారులు ఫాగింగ్ సైతం చేయించడం లేదు. కాలువల్లో దోమల లార్వా నివారణ కోసం పిచికారి చేయాల్సి ఉంది. ఇది సైతం చేయడం లేదు. అయితే పూర్తి స్థాయిలో బ్లీచింగ్, ఫాగింగ్ చేయిస్తున్నట్లు దస్త్రాల్లో నమోదు చేస్తూ నిర్వహణ నిమిత్తం లక్షల రూపాలయ ఖర్చు చూపిస్తు ప్రజాధనాన్ని కొందరు అధికారులు భారీగా దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మూలన పడ్డ చెత్త సేకరణ వాహనాలు

పట్టణంలో చెత్తను సేకరించేందుకు అప్పటి ప్రభుత్వం 22 వాహనాలు మంజూరు చేసింది. వాటిని పట్టణంలోని వివిధ ప్రాంతాలలో చెత్త సేకరణ కోసం వినయోగించే వారు. ఇందులో 7 వాహనాలు మరమ్మతుకు గురి కావటంతో అవి మూలన పడ్డాయి. వీటి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం ప్రైవేటు కంపెనీకి చెందిన గుత్తేదారుకు అప్పజెప్పింది. పురపాలక పరిధిలో చెత్తను సేకరించినందుకు ప్రతినెల గుత్తేదారుకు రూ.60వేలపైగా అద్దె చెల్లించాలి. ఈ వాహనాలతో పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో చెత్త సేకరణ చేపట్టే వారు. గుత్తేదారుడు వాహన చోదకులకు సక్రమంగా జీతాలు చెల్లించక పోవడంతో వాహనాలను కొన్ని నెలలుగా నిలిపివేశారు. దీంతో రూ. లక్షల విలువ చేసే వాహనాలను మూలన పడేయడంతో ప్రజాధనం వృథాగా మారిందని పట్టణవాసులు పేర్కొంటున్నారు.



కాలువలో పేరుకుపోయిన మురుగు నీరు



శాంతినగర్ ప్రాంతంలో మురుగు కాలువ పరిస్థితి

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జేసీ నివాళి

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణాలనే త్యాగం చేసిన మహనీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అమరజీవి జయంతి సభ నిర్వహించారు. ముందుగా జెసి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెసి మాట్లాడుతూ ఆయన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ విజయ్‌సారథి, పర్యాటక మేనేజర్ ప్రతాపరెడ్డి, ఏవో వెంకటనారాయణ, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : తెలుగు మాట్లాడే ప్రజల కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఎస్పీ వి.రత్న తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ మహేష్, పోలీసు అధికారులు, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య. చంద్ర ప్రభ వాహనం పై శ్రీవారు

ప్రజాశక్తి కదిరి టౌన్



చంద్రప్రభ వాహనంపై శ్రీవారు

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీవారు సూర్య ప్రభ వాహనం, సాయంత్రం చంద్ర ప్రభ వాహనంపై తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు వేదపండితులు , అర్చలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణలో ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్యాలు శ్రీవారి ఊరేగింపు ముందు జానపద కళాకారుల ప్రదర్శ నలు చెక్క భజనలు కీలు బొమ్మలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మోహిని ఉత్సవ వాహన సేవ నిర్వహిస్తారు.

ఖాద్రీశుడిని దర్శించుకున్న కలెక్టర్ : ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్ ఆదివారం దర్శించుకున్నారు.జిల్లా కలెక్టర్ ఆలయానికి చేరుకోగా ఆలయ ఉప సహాయ కమిషనర్ వెండి దండి శ్రీనివాసరెడ్డి, ఆలయ ప్రధాన రుత్వికులు ఏవీ నరసింహా చార్యులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయం లోని రంగనాయక మండపంలో స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజలలో కలెక్టర్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి శేష వస్త్రంతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కదిరి ఆర్డీవో ఎన్‌విఎస్. శర్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళా సాధికారతే సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ ధ్యేయమని, మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో శ్రీసత్యసాయి జిల్లా రచయిత సంఘం ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా ఎస్పీ రత్న హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణించిన మహిళలకు మహిళా శిరోమణి పురస్కారాలను మంత్రి అందజేశారు. మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత పౌరసన్మానంతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు తన పాలనలో మహిళలకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. విద్యా, ఉద్యోగావకాశాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. రాజకీయాల్లోనూ వారికి ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా భరోసా ఇస్తూ పలు పథకాలను రూపకల్పన చేశారన్నారని కొనియాడారు. డ్వాక్రా సంఘాల ఏర్పాటు చేసి, మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్య కల్పించారని దీపం పథకానికి శ్రీకారం చూట్టారని అన్నారు. మహిళా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా 11.50 లక్షల మంది మహిళలకు మేలు కలిగేలా రూ.4 వేల కోట్ల విలువైన రుణాలు, ప్రయోజనాలు సీఎం అందించారన్నారు. 1 లక్షా 2 వేల మంది మహిళలకు టైలరింగ్ లో శిక్షణ అందజేసి, ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నామని మంత్రి వివరించారు.

ఆడ బిడ్డల పట్ల వివక్ష చూపొద్దు

ఆడబిడ్డల పట్ల నిర్లక్ష్య ధోరణి, వివక్ష సరికాదని మంత్రి తెలిపారు. మగ బిడ్డలతో సమానంగా ఆడ బిడ్డలకు అన్ని అవకాశలూ కల్పించాలన్నారు. అదే సమయంలో మగ బిడ్డలకు తోటి మహిళలతో గౌరవప్రదంగా మెలిగేలా దిశానిర్దేశం చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్ని అవకాశాలు, పథకాలు కల్పించినా ప్రజల నుంచి బాలికా విద్యకు, ఉన్నతికి ప్రోత్సాహం ఉండాలన్నారు.

మహిళ రక్షణకు "శక్తి" యాప్ ఒక ఉక్కు కవచం

ప్రతి ఒక్క మహిళ మొబైల్‌లో "శక్తి" యాప్ డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి సహాయం పొందగలరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కొరకు శక్తి యాప్ ను రూపొందించిందని ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది అని చెప్పారు.

బాల్య వివాహాలను అడ్డుకోండి

నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారని, పురుషులతో సమానంగా వృత్తుల్లో నైపుణ్యం సాధిస్తున్నారని పరిటాల సునీత వెల్లడించారు. రాష్ట్రపతి, కేంద్ర ఆర్థిక మంత్రి, ఐఏఎస్ లు, ఐపీఎస్ లుగా ఎందరో మహిళలు సత్తా చాటుతున్నారన్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలోనూ బాల్య వివాహాలు జరగడం విచారకరమన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ వేంకటేశ్వర్లు, సిఐ రాఘవన్, షిర్డీసాయి గ్లోబల్ ట్రస్టు సభ్యులు శిల్పా, రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, త్రిపురా రిసార్ట్ అధినేత డాక్టర్ గోపినాథ్, కలీముల్లా, నాయకులు కేశవయ్య, నారాయణ స్వామి, మునిమడుగు వెంకటరాముడు, శ్రీనివాసులు, శ్రీరాములు యాదవ్, సిద్ధయ్య, సూర్యనారాయణ రెడ్డి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మూర్ఛ వ్యాధి వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అల్ హిలాల్ పాఠశాల ఆవరణంలో 128 ఉచిత మూర్ఛ వ్యాధి వైద్య శిబిరాన్ని డాక్టర్ ఈటి రామ్మూర్తి నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 141 మంది రోగులకు పరీక్షలను నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు రామ్మూర్తి మాట్లాడుతు మూర్ఛ వ్యాధిపై ఉన్న అపోహలను విడనాడాలన్నారు. వచ్చిన రోగులకు జెవివి నాయకులు సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు అంజన రెడ్డి, రామకృష్ణ, జి ఆర్ శ్రీనివాసులు, నాగేంద్ర చారి, ఉగ్రప్ప, అతావుల్లా, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రమణ్య నాయక్, అశోక్ కుమార్, విశ్వనాథ చారి తదితరులు పాల్గొన్నారు.




రోగిని పరీక్షిస్తున్న వైద్యులు ఈటీ రాంమూర్తి

నైపుణ్యంతో స్వయం ఉపాధి సాధ్యం

జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మనిషిలో నైపుణ్యత ఉంటే ఎక్కడైనా, ఏ ప్రాంతమైన స్వయం ఉపాధికి ఢోకా ఉండదని జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో డిగ్రీలు, పీహెచ్‌డిలు చేసినా ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం గగనం అవుతోంది. ప్రతి ఏటా నిరుద్యోగ సమస్య పెరిగిపోతోంది. ఉన్నత విద్య చదివిన వారికే ఉద్యోగాలు లేవు, ఇంకా 10 లేక ఇంటర్ ఆపైన చదివిన యువతకు చిన్నపాటి ఉద్యోగాలు దొరకక భవిష్యత్తుకు దారి కన్పించక సతమతమవుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిశ్రమలు ఒక్కటే నిరుద్యోగులకు అంతో ఇంతో ఉపాధి కల్పిస్తున్నాయి. ప్రయివేటు రంగ పరిశ్రమలలో ఉద్యోగాలు దొరకాలంటే చేతిలో నైపుణ్యత కలిగి ఉండటం తప్పనిసరి అవుతోంది. ఆ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతలో నైపుణ్యత పెంచడానికి తగిన శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇస్తున్న శిక్షణలు, శిక్షణ తర్వాత ఉపాధికి దారి చూపుతున్న తదితర అంశాలపై జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో వెల్లడించారు.



ప్రశ్న : మీ శాఖ ద్వారా నిరుద్యోగ యువతకు ఇస్తున్న శిక్షణ వివరాలు గురించి వివరించండి.?

జవాబు : రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాఫ్, ఉపాధి కార్యాలయం ద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ప్రతినెల ఒక జాబ్ మేళాను నాలుగైదు కంపెనీలతో నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ను ఏర్పాటు చేసి వివిధ రంగాలలో నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుంది. హిందూపురం పార్లమెంట్ పరిధిలోని రామగిరి మండలంలో స్కిల్ కాలేజ్ ఏర్పాటు చేసి యువతకు ఉచిత శిక్షణ భోజన వసతి కల్పించడం జరుగుతోంది. అలాగే జిల్లాలో మడకశిర, కదిరి, పెనుకొండ, ధర్మవరం, హిందూపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ అకాడమీ హిందూపురం తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రంలోను శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతోంది. శిక్షణ కేంద్రాలలో ఎలక్ట్రానిక్ సెక్టార్, ఐటి, ఐటి ఈఎస్ సెక్టార్, టెక్స్ టైల్, అగ్రికల్చర్, టెలికాం, హాస్పిటాలిటీ, అప్పారెల్, సాఫ్ట్‌వేర్, బ్యూటీషియన్, సోలార్ తదితర రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. పై కేంద్రాల్లో ఈ నెల 20 నుంచి కొత్త బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

ప్ర : గత ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఎంతమందికి శిక్షణ ఇచ్చారు.?

జ : సత్యసాయి జిల్లాలో ఏర్పాటు చేసిన 8 స్కిల్ హబ్ లు, స్కిల్ కాలేజీల ద్వారా 1268 మందికి శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది. వారిలో కొంతమంది స్వయం ఉపాధి కోసం యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో 470 మంది యువత వివిధ రకాల కోర్సులలో శిక్షణ పొందుతున్నారు.

ప్ర : శిక్షణ పొందిన వారికి ఏయే సంస్థలలో ఉపాధి కల్పించారు.?

జ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెల నియోజకవర్గ కేంద్రాల్లో నాలుగైదు కంపెనీ ప్రతినిధులతో జాబ్ మేళా నిర్వహించి యువతను ఎంపిక చేయడం జరుగుతోంది. సంకల్ప్‌లో భాగంగా ఈ ఏడాది ధర్మవరంలో 99 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించాం. కియా అనుబంధ సంస్థలలో టెలీ మహేంద్ర, విప్రో, జెంపాక్ట్, హెటీరో లేబరేటరీస్, డాక్టర్ రెడ్డి లాబరేటరీస్, అమెజాన్ క్యాప్ జెమినీ, అమర్ రాజా బ్యాటరీస్, గ్రీన్ టెక్, ప్రైవేట్ బ్యాంక్స్, కిమ్స్ హాస్పిటల్స్ మరియు బహుళ జాతీయ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోంది.

ప్ర: నైపుణ్య అభివృద్ధికి సహకరిస్తున్న ఇతర సంస్థల వివరాలు.?

జ : కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మా శాఖకు సీడాఫ్, జిల్లా ఉపాధి కల్పన కేంద్రం, డిఆర్‌డిఎ, డిఐసి, హ్యాండ్లూమ్స్ మరియు టెక్స్ టైల్, ఇతర ప్రభుత్వ శాఖలు స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తున్నాయి.

ప్ర: మీ శాఖ ద్వారా చేపడుతున్న ఇతర కార్యక్రమాలు ఏమిటి.?

జ : సంకల్ప ప్రాజెక్టులో భాగంగా డిఆర్‌డిఎ వారి సహకారంతో సొంతంగా వ్యాపారాలు చేసుకునే మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. వివిధ రంగాల్లో 120 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. హిందూపురంలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఇండస్ట్రీలో 60 మంది మహిళలకు శిక్షణ



జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ

ఇవ్వడం జరిగింది. అలాగే 13 ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ చదివే విద్యార్థులకు ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్, సాఫ్ట్ వేర్, సాఫ్ట్ స్కిల్స్ నందు శిక్షణ ఇవ్వడం జరిగింది. జిల్లాలో డిగ్రీ పూర్తి చేసుకున్న యువతి యువకులకు ఏపీలోని 500 కంపెనీలలో ఇంటర్న్ షిప్ చేయడానికి సహకరించడం జరుగుతోంది. అలాగే జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పనకు ఆరు నెలలపాటు భాషపై శిక్షణ ఇచ్చి జర్మనీలో 3 లక్షల 20 వేల రూపాయల వేతనంతో ఉద్యోగ అవకాశం కల్పిస్తాం. ప్రభుత్వ సహకారంతో వారిని జర్మనీకి పంపడం జరుగుతుంది. పిఎం విశ్వకర్మ పోగ్రాం ద్వారా జిల్లాలో 18 రకాల చేతివృత్తుల వారికి తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతోంది.

ప్ర : నిరుద్యోగ యువతకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి? మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.?

జ: సిబ్బంది కొరత లేదు. నిరుద్యోగ యువత ఉద్యోగాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాఫ్, ఉద్యోగ ఉపాధి కార్యాలయం డిఆర్‌డిఎ సంస్థల ద్వారా స్కిల్ హబ్, స్కిల్ కాలేజీల ద్వారా జరిగే శిక్షణలలో పాల్గొని ఉపాధి అవకాశాలు పొందవచ్చు. జర్మనీలో ఉద్యోగాల కోసం ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఆ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుంది. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను. ఇతర సందేహాల నివృత్తికి, శిక్షణల సమాచారానికి 99888 53335 లేదా 87126 55686 కి ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

ప్రజాశక్తి www.prajasakti.com

యుటిఎఫ్ పోరుబాట సదస్సులను జయప్రదం చేయాలి

రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి



యుటిఎఫ్ పోరుబాట సదస్సుల పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

విద్యా రంగ పరిరక్షణ, ఆర్థిక బకాయిల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 5 ప్రాంతాల్లో చేపడుతున్న యుటిఎఫ్ పోరుబాట సదస్సులను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మౌర్య రెసిడెన్సీలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాలకుల వైఖరి కారణంగా గత ఐదేళ్లలో విద్యారంగ సమస్యలతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యలు కూడా అపరిష్కృతంగా మిగిలిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం కూడా వాటిని విస్మరిస్తోందన్నారు. ప్రభుత్వ విధా నాలు విద్యను ప్రవేటీకరణ చేసే దిశగా ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయితీలో ఐదు తరగతులకు ఐదుగురు టీచర్లు, ఐదు గదులు, అన్ని సౌకర్యాలతో మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు పేరుతో మిగిలిన పాఠశాలలను నాశనం చేయకూడదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషనర్‌ను తక్షణమే నియమించి, పిఆర్‌సి అమలు చేయాలన్నారు. డిఎ ప్రకటించాలన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, సహాధ్యక్షులు బాబు, కోశాధికారి డి.శ్రీనివాసులు, కార్యదర్శులు కె.శివశంకర్, సి.లక్ష్మీనారాయణ, జిసి.నరేష్‌కుమార్, డి.అనిల్ కుమార్, డి.నరసింహప్ప, క్రిష్టప్ప, ఎంవి.మారుతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులను నిలిపేయాలి : జిల్లా రైతు సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

హంద్రీనీవా లైనింగ్ పనులను తక్షణమే నిలిపేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షులు పెనుకొండ హరి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేపట్టడం రైతులకు ద్రోహం చేయడమే అన్నారు. లైనింగ్ పనులు చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి జిల్లా ఎడారిగా మారుతుందన్నారు. లైనింగ్ పనుల వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. దీనికి పెట్టే ఖర్చుతో కాలువను వెడల్పు చేసి మారుమూల ప్రాంతాలకు కూడా హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తీసుకెళ్లవచ్చన్నారు. కాలువను వెడల్పు చేయడం వల్ల కాలువలో నీటి సామర్థ్యం పెరిగి చుట్టుపక్కల ప్రాంతాల్లోని బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేని కేవలం కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చే లైనింగ్ పనుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను నిలుపుదల చేయాలని, పంట కాలువల నిర్వహణ ప్రయివేట్ ఏజెన్సీలకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మారుతి, కదిరిప్ప, ఎస్‌హెచ్ బాషా పాల్గొన్నారు.

హబ్ భూములనూ వదలని రియల్టర్లు.. నిద్రపోతున్న అధికారులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

బెంగుళూరుకు చెందిన ఓ రియల్టర్ ఆగడాలు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. ఆక్రమణలపై తాజాగా ప్రజాశక్తి దినపత్రికలో 'రియల్టర్ ఆక్రమణ' పేరిట వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. సదరు రియల్టర్ ఆక్రమణలో ఉన్న భూములపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఆ నివేదికలో అనేక అక్రమాలు వెలుగుచూశాయి.

లేపాక్షి హబ్ భూములనూ ఆక్రమించారు

వంక పోరంబోకు, అసైన్డ్ భూములు, ఎడబ్ల్యు భూములే కాదు.. ఎపిఐఐసి, లేపాక్షి నాలెడ్జ్ భూములనూ వదలేదు. కోడూరు రెవెన్యూ పొలంలోని సర్వే నెంబర్ 679-1లో 5.29 ఎకరాలు, సర్వేనెంబర్ 679-2లోని 12.09 ఎకరాల భూమి చుట్టూ కంచె వేసి ఆక్రమించుకున్నట్లు రెవెన్యూ అధికారులే నిర్ధారించి ఉన్నతాధికారులకి నివేదిక పంపారు.

అధికారుల తీరుపై అనుమానాలు..!

ఇదిలా ఉండగా సదరు రియల్టర్ ఏకంగా చిత్రావతి నదిపై అడ్డుగా బ్రిడ్జిని నిర్మించినా అతడికి మేలు చేయడంలో భాగంగా నివేదికలో కుషావతి నది తప్పుగా ఇవ్వడం, అక్రమంగా బ్రిడ్జిని నిర్మించారని తెలిసినా ఇప్పటి వరకూ ఆ బ్రిడ్జిని తొలిగించకపోవడం, అనుమతి కోసం ఇప్పుడైనా అప్లికేషన్ పెట్టుకుని దానిని సరి చేసుకోవాలని అతనికి సలహా ఇవ్వడంపై అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపి

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఎంపి పరామర్శ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పూల ఓబులేసు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎంపి బికె.పార్థసారథి ఆదివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సాయం చేసి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు నాయకులు జివిపి.నాయుడు, నరసింహులు, నాగరాజు, డీలర్ మూర్తి ఉన్నారు. కాగా లక్కమ్మగుడికి, కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండ లంలోని సానిపల్లి గ్రామ కురుబ సామాజిక వర్గం ప్రజలు ఆదివారం మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామంలో ఎంపి బికె.పార్థసారథికి వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ఎంపి జూన్‌లో నిధులు మంజూరు చేస్తానని తెలిపారు.

నాటుసారాపై కళాజాత

గాండ్లపెంట : మండలంలోని వేపరాల పంచాయతీలోని సిఎం తండాలో ఆదివారం నాటుసారాపై కళాజాత ద్వారా అవగాహన కల్పించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమద్దయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తాగడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని వివరించారు. నాటుసారా తయారీ, విక్రయించడం నేరమన్నారు. నాటుసారా జోలికి వెళ్లమని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ హరికృష్ణ, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ఫోర్డ్ సంస్థ ధ్యేయం



సమావేశానికి హాజరైన కర్నాటక మహిళా సంఘం సభ్యులు

ప్రజాశక్తి-గుడిబండ

మహిళల ఆర్థిక స్వావలంబనే ఫోర్డ్ సంస్థ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. మహిళా సంఘాల సాధికారతపై ఆదివారం జెఎస్‌డబ్ల్యు ఫోర్డ్, ఎన్జీవో ఆధ్వర్యంలో కర్నాటకలోని బళ్లారి జిల్లా నుంచి 80 మంది మహిళా సంఘ సభ్యులు మండలంలోని కరికెర గ్రామంలో సందర్శించి పవిత్ర గ్రామైక్య సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. మహిళల ఆర్థిక స్వావలంబన, మహిళా సంఘాలు, రైతు సంఘాల నిర్వహణ, ఎఫ్‌పిఒ సేవలు, మహిళా సంఘాల అభివృద్ధి, ఆదాయ, వ్యయాల వివరాలు తెలుసుకున్నారు. పవిత్ర గ్రామ సంఘం ఆర్థిక లావాదేవీలు, ఎస్ఇఆర్‌పి ద్వారా మహిళల అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫోర్డ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్, ఫోర్ సంస్థ అధ్యక్షులు బదరీస్, వెలుగు ఎపి నాగరాజు, ఫోర్డ్ సంస్థ కోఆర్డినేటర్ మహలింగప్ప, జెఎస్‌డబ్ల్యు కోఆర్డినేటర్ వెంకటేష్, ఎపిఎం తిప్పన్న, మహిళా సంఘ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పుట్టపర్తి క్రైమ్ : మద్యం లైసెన్స్‌దారులు నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ నాగరాజు హెచ్చరించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎక్సైజ్ పోలీసులు వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ బుక్కపట్నం మండలంలోని మద్యం షాపుల పరిసర ప్రాంతాలు, దాబాలు, హోటళ్లలో దాడులు చేసి అక్రమంగా మద్యం తాగుతున్న యజమానులపై కేసులు నమో దు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ ఉమామహేశ్వర్ రాజు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ చోరీ

గాండ్లపెంట : మండలంలోని గొడ్డువెలగల పంచాయతీలోని సత్యసాయి పంప్ హౌస్ వద్ద మోటర్ చోరీకి గురైందని ఆర్‌డబ్ల్యుఎస్ జెఈ ప్రకాష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జెఈ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. గొడ్డు వెలగల సత్యసాయి తాగునీటి పంప్ హౌస్ వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 25 హెచ్‌పి మోటార్ చోరీ ఎత్తుకెళ్లారని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం గ్రామంలో నివాసం ఉంటున్న వడ్డే వెంకటరామప్ప అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న టిడిపి నాయకులు ఆదివారం ఆ గ్రామం వెళ్లి మృతుని కుటుంబానికి రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాల్మీకి బోయ సాధికార సమితి మెంబర్ చంద్ర, మనోహర్, జయచంద్రారెడ్డి, సుబహాన్, గంగాధర్‌మూర్తి, కిషోర్, గిరి, గంగరాజు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

హిందూపురం : పట్టణంలోని 32వ వార్డు కౌన్సిలర్ రేష్మాబాను ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రంజాన్, ఉగాది రెండు పండుగలు ఒకే రావడంతో కౌన్సిలర్ తన వార్డు పరిధిలో ఉన్న పారిశుధ్యకార్మికులను గుర్తించి, వారందరికి నిత్యావసర సరుకులు, దుస్తులు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతున్నట్లు ఎంఇఒలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి తెలిపారు. అర్బన్, రూరల్ కలిపి 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూరల్, మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ విద్యార్థులు 1075, ప్రయివేటు విద్యార్థులు 1072 మొత్తం 2147 మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో నిఘా నేత్రాలు, సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష సమయానికి అర గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ధర్మవరం రూరల్ : మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఇఒలు రాజేశ్వరీదేవి, గోపాల్ నాయక్ తెలిపారు. పట్టణంలో 11 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 2,156 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులు యూనిఫారం లేకుండా హాజరు కావాలని వారు స్పష్టం చేశారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలను పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని, 30 మంది హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

144 సెక్షన్ అంక్షలు

నంబులపూలకుంట/గాండ్లపెంట : పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అంక్షలు అమలులో ఉంటాయని ఎస్ఐ బసిరెడ్డి తెలిపారు. స్థానిక జడ్పి హైస్కూల్‌తో పాటు గాండ్లపెంట మండలంలోని జడ్పి హైస్కూల్, కటారుపల్లి క్రాస్ వద్ద ఉన్న ఇక్బాల్‌లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతుండడంతో ఆ సమయంలో పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సోమందేపల్లి : మండల వ్యాప్తంగా 506 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని ఎంఇఒ అంజనేయులునాయక్ తెలిపారు. పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అంక్షలు అమలులో ఉంటాయని, ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే చర్యలు తప్పవన్నారు.

ఘంటసాలకు నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కళాజ్యోతి ప్రాంగణంలో ఆదివారం కళాజ్యోతి కార్యదర్శి బాలకొండ, రామకృష్ణ ఆధ్వర్యంలో ఘంటసాల వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభ అధ్యక్షులుగా కళాజ్యోతి సంస్థ అధ్యక్షులు కుంటిమల నారాయణ, కళాజ్యోతి కమిటీ సభ్యులు హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ గాయకులు బాల కామేశ్వరరావు- హైదరాబాద్ బృందం చేపట్టిన ఘంటసాల పాటల కచేరి అలరించింది. ముఖ్య అతిథులు ఘంటసాల పాటలను కొనియాడారు. గాయనీ, గాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రామకృష్ణ, సభ్యులు జగ్గా వేణుగోపాల్, పల్లె వేణుగోపాల్, రాంప్రసాద్, మధుసూదన, పెద్దారెడ్డి, రమేష్ బాబు, రామన్న, పోలా వెంకటనారాయణ, మోహన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ సర్పంచి అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-నల్లచెరువు

ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నుంచి జాతీయ ఉత్తమ సర్పంచి పురస్కారం అందుకున్న సర్పంచి బి.పంచరత్నమ్మను ఆదివారం స్థానిక గీతా మందిరంలో భారతీయ అంబేద్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బాస్ వ్యవస్థాపక కుడు పిటిఎం శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో డిఎస్‌పి ఆంజనేయ, ఉరిస్ (ట్రాఫిక్) ఇన్‌స్పెక్టర్ పెద్దన్న, ప్రజాకవి పోతలేటు రెడ్డెప్ప, రిటైర్డ్ డిప్యూటీ జైలర్ బి.లక్ష్మీనారాయణ, రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి. చంద్రయ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వారు భూదా గ్రహీత పంచ రత్నమ్మ ఆమె భర్త ఉత్తన్నలను గజమాలతో సత్కరించారు. శాలువా కప్పి, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో డాక్టర్ గంగాధ్రి, బావన్న, నరసింహులు, జనార్ధన్, సుధాకర్, ఆదిమూర్తి, ఆర్యర శ్రీనివాస్, చిన్నప్ప, అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతకు ఘన సన్మానిస్తున్న బాస్ సభ్యులు

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం : మంత్రి



బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-బత్తలపల్లి

రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే దిశగా ఎన్‌డిఎ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మండలంలోని అప్రాచెర్వు గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన 11కెవి 24/7 ఫీడర్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఆర్‌డిఎస్ఎస్ కింద రూ.1.62 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ ద్వారా అప్రా చెరువు, చెన్నరాయపట్నం, జ్వాలపురం గ్రామాలకు నిరంతర త్రీ-ఫేస్ విద్యుత్ సరఫరా అందిస్తామ న్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 590 మంది వినియోగదారులకు లాభం చేకూరుతుందన్నారు. వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ లభించడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ఆర్‌డిఎస్ఎస్ పథకం ద్వారా మరిన్ని గ్రామాలకు విద్యుత్ అభివృద్ధి కొనసాగుతుందని మంత్రి తెలిపారు. అనంతరం బత్తలపల్లిలో రూ. 22 లక్షల వ్యయంతో నిర్మించిన ఎఈఈ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. మండల పరిధిలో విద్యుత్ పంపిణీలో సమస్యల సత్వర పరిష్కారానికి, ప్రజలకు అవసరమైన విద్యుత్ సేవలకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : మంత్రి

బత్తలపల్లితో పాటు మండల వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడుతున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. బత్తలపల్లితో పాటు మండల ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు జడ్పిటిసి కోటి సుధ రూ. 35 లక్షల జిల్లా పరిషత్ నిధులను కేటాయించారు. అందులో భాగంగా స్థానిక ధర్మవరం రోడ్డు వద్ద రూ. 5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బోరుబావి పనులను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జడ్పిటిసి కోటి సుధ మాట్లాడుతూ మండలంలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, ఆర్డీవో మహేష్, తహశీల్దార్ స్వర్ణలత, ఎస్ఈ బాలసురేంద్ర, ఏఈ శివయ్య, జడ్పిటిసి కోటి సుధ, కోటి బాబు, ఉపసర్పంచి కోటి గోపినాథ్, జింకా చంద్రశేఖర, ఓబులేసు, ఆకులేటి భాస్కర్, ఆకులేటి వీరనారప్ప, ఆకులేటి మల్లికార్జున, అమర్నాథ్‌రెడ్డి, తాతయ్య, నారాయణ స్వామి, బోయ పెద్ద లింగమయ్య బ్రదర్స్, కంచం లీలావతి, నారప్ప, తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ఎన్‌డిఎ కార్యాలయంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ అనారోగ్య బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం పేదల సంక్షేమ కోసమే పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగా సిఎంఆర్ఎఫ్ కింద రూ. 47 లక్షల మొత్తాన్ని అందజేశామన్నారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలను గాలికి వదిలేసి వైద్య ఆరోగ్య శాఖ వ్యవస్థను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం.శేఖర్, కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, పట్టణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర, ఓబులేష్, రూరల్ అధ్యక్షులు చంద్ర శేఖర్, అంబటి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో అగ్ని ప్రమాదం

రూ. 2 కోట్లకు పైగా ఆస్తి నష్టం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ. 2 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధికారి ఎడిఎం పుట్టపర్తి నరసింహమూర్తి, డిఈఈ ఎస్.రఘునాథ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అగ్ని ప్రమాదంలో షెడ్, పైపులు కాలిపోవడంతో రూ. 2 కోట్లకు పైగా నష్టం జరిగిందని అంచనా వేశారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన బాధ్యులను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. అమరావతి వెంకటపాళ్యంలో ఉన్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి అగ్ని ప్రమాదంపై ఆరా తీశారు. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మంటలు పక్కనే ఉన్న మైనార్టీ కాలనీకి విస్తరించకుండా తొందరగా మంటలార్పిన పావగడ, హిందూపురం, పెనుకొండ, మడకశిర, అగ్నిమాపక సిబ్బందికి, మడకశిర పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పరిశీలించిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు భక్తర్‌సాబ్, కౌన్సిలర్లు ఉమాశంకర్, హనుమంతు, ప్రధాన కార్యదర్శులు రంగేగౌడ్, పుల్లయ్య, నాయకులు నాగరాజు, తిమ్మరాజు, కృష్ణమూర్తి, దాదు, రవి, డీలర్లు ఉన్నారు.

బేకరీ యజమాని ఆత్మహత్య

ప్రజాశక్తి-బత్తలపల్లి

కుమార్తె వివాహం, కుమారుడి చదువు విషయంలో బెంగ పెట్టుకున్న బేకరీ యజమాని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం బత్తలపల్లిలో చోటుచేసుకుంది. మృతుడి భార్య లక్ష్మీకళ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు.. అంబాల పరంబత్ జయప్రకాష్(55) 35 ఏళ్ల క్రితం కేరళ నుంచి బత్తలపల్లికి వచ్చి స్థానిక టీచర్స్ కాలనీలో కాపురం ఉంటూ కదిరి రోడ్డులో బేకరీ షాపు నిర్వహిస్తున్నాడు. వారి కూతురు రిన్షా జపాన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, కుమారుడు రోహన్ బెంగళూరులో బీ.టెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని నెలలుగా వ్యాపారం సరిగా జరగకపోవడం, రోడ్డు విస్తరణలో భాగంగా షాపు తొలగించే పరిస్థితి రావడంతో కుమారుని చదువు, కుమార్తె పెళ్లి ఎలా చేయాలోనని తరచూ భార్య వద్ద బాధపడేవాడు. బంధువుల సీమంతం కార్యక్రమం ఉండడంతో శనివారం లక్ష్మీకళ బెంగళూరుకి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న జయప్రకాష్ ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటలకు కూతురికి ఫోన్ చేసి 'నేను చనిపోతానమ్మా.. ఇక బతకను' అని తెలిపాడు. ఈ విషయాన్ని కూతురు తల్లికి చెప్పడంతో ఆమె తమ ఇంటి సమీపంలో ఉన్న సాంబశివుడుకి ఫోన్ చేసింది. దీంతో అతడు ఇంటి వద్దకు వెళ్లి చూడగా అప్పటికే జయప్రకాష్ బేకరీ రేకుల షెడ్డులో పైపునకు తాడుతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మీకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అగళి : స్థానిక ఎపి మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో ప్రవేశం కోసం ఈ నెల 18 నుంచి మే 22వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ జాఫర్ తెలిపారు. మోడల్ జూనియర్ కాలేజీలో మ్యాథమేటిక్స్, సైన్స్, కామర్స్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా తయారు చేసి సీటు కేటాయిస్తామని ప్రిన్సిపల్ తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

చిలమత్తూరు : బెంగళూరుకు చెందిన బాలరాజు దంపతులు దాతృత్వం చాటుకున్నారు. వారు ఆదివారం మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్‌లోని సమర్థనం దివ్యాంగుల సంస్థలో దివ్యాంగ విద్యార్థులకు దుప్పట్లు, టీషర్టులు, పెన్నులు పంపిణీ చేశారు. బాలరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కనుముక్కల సోమశేఖర్, నాగరాజు, సమర్థనం సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, రాబర్ట్, వార్డెన్ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని మద్దనకుంట జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పాత్రికేయులు షబ్బీర్, షబానా దంపతులు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఏటా పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కుల తో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచిం చారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ వీరముద్దప్ప, దాసప్ప, శీనప్ప, పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ సాయిమనోహర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన త్యాగాలను తెలుగుజాతి స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ అబ్దుల్‌నబి, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు ఎల్లప్ప, మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కపట్నం : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చిరస్మరణీయ మని ఎపి ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి పోలేపల్లి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, రమేష్, తేజ, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వైసిపి నాయకులు పట్టణ సమీపంలోని ఆమిదాలగొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి నాయకులుకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జయరాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ఎస్ఎన్.కృష్ణమూర్తి, సైఫుల్లా, కౌన్సిలర్లు అన్సర్‌ఖాన్, శ్రీనివాసులు, వెంకటేష్ పాల్గొన్నారు.

కీచక ప్రిన్సిపల్ అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఈ నెల 14న హోలీ పండుగ సందర్భంగా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పట్టణంలోని అమృతవల్లి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి. వెంకటపతిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం హిందూపురము రోడ్, కోనేరు బస్ స్టాప్ వద్ద అరెస్టు చేసి విచారణ అనంతరం న్యాయమూర్తి వద్ద హాజరు పరచగా ఈనెల 28 వరకు రిమాండ్ విధించడంతో నిందితుడిని కదిరి సబ్ జైలుకు తరలించారు.

ఎమ్మెల్యే చొరవతో సిఎంఆర్ఎఫ్ మంజూరు

ప్రజాశక్తి-తలుపుల

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేయ చొరవతో గత వైసిపి ప్రభుత్వంలో నిలిపివేయబడిన సిఎం రిలీఫ్ ఫండ్ ఎట్టకేలకు మంజూరైంది. దీంతో ఎమ్మెల్యే ఆదివారం మండలంలోని ఈదులకుంట్లపల్లి పంచాయతీలోని భూపతివారిపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఓబుళనాయుడునికి రూ. 4 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ముబారక్, మేడా శంకర్, నాయకులు అజంతుల్లా, బాబు, మల్లినాయుడు, దేవేంద్ర నాయక్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మండలంలోని ఈదులకుంట్లపల్లి గ్రామపంచాయతీకి చెందిన కొవ్వూరివాండ్లపల్లిలో నీటి సమస్య తలెత్తగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బోరు వేయించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి ఈ.కుమారిబాయి, నాయకులు ఈ.దేవేంద్ర, టి.సూర్యశేఖర్‌రెడ్డి, గంగిశెట్టి, రమణయ్య, ఆంజనేయులు, కె.మధు, రమణయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

పెనుకొండ : పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి సవిత అనారోగ్య భాదితులకు సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. వారిలో పరిగి మండలానికి చెందిన తేజకు రూ. 1,82,668, ఎర్రగుంట జయలక్ష్మి-రూ. 39,162, బసంపల్లి గోవిందరెడ్డి-రూ. 25వేలు, కోనాపురం సువర్ణమ్మ-రూ.51,309, ఎర్రగుంట కృష్ణప్ప-రూ.75,950, పెనుకొండ మండలానికి చెందిన మావటూరు ముద్దన్నగారి ఆంజనేయులు-రూ.1,08,800, మరువపల్లి రమేష్-రూ. 55వేలు, రొద్దం మండలంలోని ఆర్.లోచర్ల కె.శ్రీరాములు-రూ.2,70,189, నారానాగేపల్లి చిన్ననారాయణ-రూ.126,800, సోమందేపల్లిలోని గుడిపల్లికి చెందిన శిల్పా రాజశేఖర్-రూ.1,22,441, సోమందేపల్లి టౌన్‌కు చెందిన కృష్ణమూర్తి యాదవ్‌కు రూ. 50,600 చెక్కులను మంత్రి అందజేశారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

హిందూపురం : హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ సిఐ లక్ష్మీదుర్గయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని మద్యం దుకాణాలు, బార్లను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం నిల్వ రికార్డులను పరిశీలించారు. మద్యం దుకాణాల్లో మద్యం ఎంఆర్పీ ధరలకు అమ్మాలని, బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేయరాదని సిఐ హెచ్చరించారు. అదే విధంగా పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన పఠాన్ యూసఫ్ ఖాన్ అనే వ్యక్తి కర్నాటక నుంచి అక్రమంగా తీసుకువచ్చిన 25 ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫారూక్, హెడ్‌కానిస్టేబుళ్లు నరసింహ, సతీష్, వెంకటేష్, సిబ్బంది. ఆంజనేయులు, సురేష్, సుధాకర్‌రెడ్డి, శివకుమార్, రవీంద్ర పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యం

ప్రజాశక్తి-హిందూపురం

సాంకేతిక వైజ్ఞానిక రంగంలో తమకంటూ ఒక స్థానాన్ని సాధించాలన్న ధృఢ సంకల్పంతో ప్రతి విద్యార్థి పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యమని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపల్ హరి ప్రసాద్ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పట్టణంలో ప్రత్యేకించి మహిళల కోసం పాలిటెక్నిక్ కళాశాలను అప్పట్లో ప్రారంభించారన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న మహిళలు ఎంతోమంది వారి జీవితంలో స్థిరపడ్డారన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను ఛైర్మన్ రమేష్ కుమార్ అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, అధ్యాపకులు శ్రీనివాసులు, హిమబిందు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్